ఇల్లరికం

శ్రీ కె. శశాంక్.

[కథలోని పాత్రపోషణ- రామం ఒక సామాన్య మానవుడు మానవుడనేక రంగాల్లో, అనేక విధాలుగా ఎట్లా ప్రవర్తిస్తుంటాడో, ఆ ప్రవర్తనలో ఏమాత్రం 'ఒప్పుదల' ఉంటుందో, అది రామం పాత్రలో వ్యక్తపరచదలచాను శంకరయ్య రెండవ పెళ్ళి చేసుకున్నంతమాత్రాన దౌర్బల్యహృదయుడన్న రామం భావం నా భావంగా వ్యక్తపరచలేదు ఒక్కొక్కప్పుడు కొడుకుసైతం తండ్రి నెలా అపార్థం చేసుకుంటాడో, చివరికి తన తండ్రిలో ఏదైనా 'మంచి' అంటూఉంటే దాన్ని పురస్కరించుకునెలా పశ్చాత్తాప పడ్డాడో ఊహించాను

మాలతి ఆదర్శ యువతి అందరకీ అండలా కన్పించ గల్గే ఆమెను ఇంకా అధికంగా గొప్ప జేసి నా కథలో చూపించటానికంటే, ఆమె గొప్పతనాన్ని పాఠకులే తమ స్వతంత్ర భావాలతో ఊహించుకోవాలని, మాలతి పాత్రపోషణలో కేవలం ఆమె చేసిన పనులెలాంటివో సామాన్యంగా చెప్పేశాను.

ఇంక, శశి, కమల, రామ్‌ప్రసాద్ వీళ్ళందరిని గూర్చి అంతగా చెప్పాల్సిన అవసరం లేదు సుశీని ఒక అమాయిక జీవిలా చిత్రించాను మొత్తంమీద ఇందులో మానవుడన్న ప్రతివాడు కూడా మంచి చెడ్డల మిళితుడనీ, అతనిలో సమయానుకూలంగా భావాలు పొడగడ్తూంటయ్యనీ, సామాన్య సంసారుల కుటుంబం చివరికి పరోక్షంగా విచ్ఛిన్నమైనా, ఆత్మీయత అణిగిపోలేదనీ నిరూపింపదలచాను లోపాలు లేవని చెప్పగల సాహసం లేకపోయినా, నా కృషి లోపం లేదని ధీమాగా చెప్పగలను]

--- o ---

ఎండ మాడిపోతున్నది. గ్రీష్మ తాపాన్ని భరిస్తూ దూరంగా కూలీలు రోడ్డును మరమ్మత్తు చేస్తున్నారు ఇంకొ కొంచెం దూరంలో ఒక కుక్క నాలుక వేళ్ళబెట్టుకుని హాయిగా నిద్రపోతున్నది ఒక చెట్టు కింద చెట్ల కొమ్మలకు కట్టిన గుడ్డ ఉయ్యాలలో కూలీ కూతురు పసికందు, స్వర్గధామంలో విశ్రమించుతూన్నట్టుగా, మైమరచి నిద్రపోతోంది కిళ్ళీ కొట్టుదగ్గర కూర్చున్న రామం ప్రశాంతమైన ఆ ప్రకృతిలోనే ఎంతటి గాలిదుమారం రేగుతోందో, ఊహించుకుంటూ, తన తండ్రి స్వభావానికీ ఆ ప్రకృతికీ పోలిక కల్పి, తనలోతానే జుగుప్సతో దహించుకొనిపోసాగాడు

రామం హృదయం అంతగా కల్లోలమైందంటే అందుకు కారణం లేకపోలేదు తండ్రి రెండో పెళ్ళి చేసుకుంటున్నట్లు చెప్పాడు సుమారు ఇరవైరెండేళ్ళవాడు, తనన్నా ఇంకా పెళ్ళి చేసుకోకుండా ఉన్నాడు. కాని ఏభై ఏళ్లవాడు ఇంకా పెళ్ళేమిటి?— శంకరయ్య పెళ్ళిచేసుకుంటున్న సంగతి విన్న రామం హృదయం భగ్గుమన్నది. కాని అంత మాత్రాన అతను పెళ్ళికోసం తహ తహ లాడ్తున్నాడని మనం భావించటానికి వీల్లేదు అతనికి చెల్లెళ్లున్నారు కులాచారమంటూ ధనా భావాన్ని కప్పిపుచ్చి, వాళ్లకు చదువు కూడా మాన్పించాడాయన వాళ్ళ బాధ్యత తనకేమీ లేదన్నట్లుగా, నిర్భయంగా మళ్ళీపెళ్ళి చేసుకోవటం రామానికి అసహ్య మనిపించింది

"అయ్యగారు, మళ్లీ పెళ్ళి చేసుకుంటారంటగా?" అన్నాడు కిల్లీ కొట్టు వెంకయ్య

"ఆ" అన్నాడు నిరసనగా రామం.

"అదేంది రామయగోరూ! పెద్ద తనంలో 'రామా! కృష్ణా!' అని పడుండక ఇదేం బుద్దంట?" - రామానికి తండ్రి అంటే నిరసన అని వెంకయ్యకు తెలుసు. అందుకే అంత ధైర్యంగా ఆ మాట అనగల్గాడు.

"సరే ఆ మాటలు నాతో ఎందుకూ? బుద్ధి లేకుండా మాట్లాడుతావ్? ఒక సోడా కొట్టియ్యి" అంటూ సోడా తాగి వెళ్ళిపోయాడు రామం

"హే అబ్బ మాట పిల్లోడికి నచ్చదు- పిల్లోడి మాట అబ్బకు నచ్చదు— ఇద్దరూ ఇంక పిలకలు పట్టు కోటమే మిగిలింది." అనుకున్నాడు హేళనగా వెంకయ్య

రామానికి తండ్రి రెండో పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదు అందుకే ఆనాడంతా అన్య మనస్కుడై, జుగుప్సా పూరితుడై అక్కడా ఇక్కడా తిరుగుతూ గడపి రాత్రి ఇంటికి చేరాడు

వాకిట్లో తండ్రి ఈజీఛైర్‌లో పడుకుని తల నిమురుకుంటూ ఏదో ఆలోచిస్తున్నాడు కొడుకు అతన్ని పలకరించలేదు అతను కొడుకుని పలకరించలేదు రామం తీక్షణంగా లోపలికెళ్ళిపోయాడు శంకరయ్యకు అన్నం పెట్టి రామం కోసం నిరీక్షిస్తోంది శాంత

భోజనం ముందు మౌనంగా ఉండి లేచాడు రామం శాంత కూడా అన్నం తిని పనంతా పూర్తి చేసుకుని చెల్లెలు ప్రక్కకెళ్ళి పడుకుంది. సుశీల నిద్రపోతోంది అమాయకమైన ఆ మొహంలోకి చూస్తూ, రాబోయే సవతి తల్లి పట్ల తా మెట్లా వ్యవహరించాలో అర్థం చేసుకోలేక, అందువల్ల చాలా బాధలుంటయ్యన్న భ్రమతో బాధగా నిటూర్చింది శాంత సుశీల మరీ అమాయకురాలు అడవి గోడుపిల్ల ఆ అమ్మాయిని గూర్చిన ప్రతి విషయమూ కూడా ఇంకోరు గమనిస్తే తప్ప నోరు విప్పి ఏదీ చెప్పేదికాదు తల్లి బతికున్న రోజుల్లో, అన్నిటినీ జాగ్రత్తగా పరిశీలిస్తూ ఆ సుశీలను రక్షించవలసిన బాధ్యతంతా ఆమే భరించేది ఆ బాధ్యత మాతృశ్రీ అనంతరం శాంత మీద పడ్డది జ్వరమొస్తే ఆ బాధ ఎలాంటిదో చెప్పటం తెలీదు సుశీలకు ఆకలేస్తే అన్నం తినాలని తోచేదికాదు చిన్న చిన్న కథలు వ్రాస్తూండేది. అందులోనే తన్మయత్వం పొందేది పదమూడేళ్ళ సుశీలలోని ఆ పరధ్యానత ఎందువల్ల? చదువులో కన్పించేవి ఆమె తెలివితేటలన్నీకూడా అటువంటి సుశీలకు కష్టమన్పించింది అయినా నోరు విప్పి మాట్లాడేందుకు వీలులేదు——

రామం సరాసరి తండ్రి దగ్గరకు వెళ్ళాడు "నువ్వు పెళ్ళిచేసుకోటం నాకిష్టం లేదు." అన్నాడు పిడుగు పడ్డట్టు "నువ్వు కనుక చేసుకున్నావంటే, నేను ఈ ఇంట్లోంచే లేచిపోతాను " జవాబుకోసం ఎదురు చూడకుండా అంధకారంలోకి మాయమయ్యాడు

శంకరయ్య ఏ మాత్రం ఆశ్చర్యాన్ని వెళ్ళగక్కలేదు. చూస్తూ ఊరుకున్నాడు వధువు కూడా దొరికింది ఇవన్నీ జరిగాకే ఆయన రామంతో అసలు సంగతి చెప్పాడు

ఊళ్ళో అంతా చెప్పుకున్నారు 'ఏంచేస్తాడు లేకపోతే?' అన్నారు కొంతమంది. వెంకయ్యలా మూతి విరిచినవాళ్ళూ ఉన్నారు అతన్ని చూచి జాలిపడ్డవాళ్లూ వున్నారు కొద్దిమంది "మనిషిలో- దౌర్బల్యం ఇంతే చేస్తుంది" అనుకున్నారు

శంకరయ్య దౌర్బల్య హృదయుడంటే ఒప్పుకోవచ్చు గానీ, మరీ అంత నీచానికి ఒడిగట్టేవాడని అనుకోటానికి వీల్లేదు అయినా అనాదినుంచీ వస్తున్న ఈ మళ్ళీపెళ్ళిని తను కూడా చేసుకోవాలన్న కోరిక, మొదటి భార్య పోయినప్పట్నుంచీ అతనికున్నది అందువల్ల కల్గే సాధక బాధకాలూ ఆయనకు తెలుసు ఇప్పుడాయన తన సంగతి ఆలోచించుకోటంలోనే ఉన్నాడు కాని పిల్లల విషయమాలోచించలేకపోతున్నాడు ఆయన తన దౌర్బల్యాన్ని విషయంలో వెల్లడి చేసినట్లు కొడుకు రామం అతన్ని తిరస్కార భావంతో మాట్లాడాడు కాని శంకరయ్య అన్నిటికీ అవును, కాదు, అన్నట్లుగా జవాబు చెప్తూ, ముక్తసరిగా ఊరుకున్నాడు కొడుకు ఎదుట తన గాంభీర్యాన్నిమాత్రం పోగొట్టుకోలేదు ఈ పెళ్ళి జరిగేదే, అని తెలిసి ఉండీ రామం అతనితో అన్ని విధాలా పోట్లాడాడంటే మనస్సులో ఉన్న అక్కసునంతా వెళ్ళబోసుకుందుకే!

అసలు రామానికి ఒళ్ళు మంటపుట్టించేది- తన తల్లి జబ్బుతో మంచానపడి మరణవేదన పొందుతూంటే, శంకరయ్యపడ్డ బాధ ఇంతా అంతా కాదు పైగా కోర్టుకెళ్ళటంకూడా మానేసి, ఇంట్లో ఉండి అహోరాత్రులూ ఆమెను బ్రతికించుకుందుకు కృషి చేసేవాడు కాని ఆ కృషికి ఫలం దక్కలేదు ఆనాడు ఆమెకోసం అంత ఆత్రుత చూపించిన వాడు ఈనాడామె చావగానే ఇంకో పెళ్ళికెందుకు ఒడిగట్టాలి? — ఇదీ అతని ప్రశ్న ఇందులో ఎంతవరకు సమంజసమున్నది అతనికి తెలీదు ఆలోచించుకునే ఓర్పులేదు కాని ఆ పెళ్ళి మాన్పించటం మాత్రమే అతని ప్రధాన లక్ష్యం అదే సాగలేదు పెళ్ళైపోయింది నెఱసిన వెండ్రుకలతో పెళ్ళి పీటలమీద కూర్చున్న తండ్రి చూస్తే రామానికి మహా విరక్తి కల్గింది శాంతా, సుశీ ఇద్దరూ నిస్పృహగా పనులు చేసుకుంటున్నారు సుశీ

ఎప్పుడూ నిస్పృహే! అది ఆమెకు స్వతహాగా వచ్చిన గుణం అంతా జాలిగా రామం, శాంతా, సుశీలలను పరామర్శించారు రామం గంభీరంగా ఊరుకున్నాడు అమ్మలక్కలు చమత్కారంగా ఎత్తిపొడిస్తే, శాంతకూడా చమత్కారంగానే జవాబు చెప్తూ లేని నవ్వు తెచ్చుకుంటున్నది అంతాచూస్తూ, మండిపోతూ, తన్ను తాను తమాయించుకు కూచున్నాడు రామం

౨

"శాంతా! మీ నాన్న భోజనానికొస్తున్నారు, పీట వేసి కంచం పెట్టమ్మా!" అంది మృదువుగా కమల వయస్సు ముప్పై ఏళ్ళుంటాయ్ మరీ అంత కురూపి కాదు కొంచెం పళ్ళెత్తు మరీ నలుపు కాకపోయినా, నలుపు రంగులోనే లెక్క. తల్లితండ్రులు లేక, అన్నల ప్రాపున బతుకుతున్న కమల అన్నల ఆదాయం తక్కువ అవటం వల్లా, వాళ్ళకు సేవ చేస్తూ న్నంతకాలం తనను అశ్రద్ధచేస్తూ, చివరికి పెళ్ళిమాట వచ్చే సరికి శంకరయ్య లాంటి వాళ్ళే రావటం, వచ్చినవాళ్ళందరిలోనూ శంకరయ్యే కొంచెం అన్నిటిలోకీ నయం అనిపించటంవల్ల చివరికి అతనికిచ్చి కమలకు పెళ్ళిచేయటం, ఇతివృత్తం కమలకథ.

శాంత నెమ్మదిగా లేచి తండ్రి భోజనానికి అన్నీ అమర్చింది కమల వచ్చిన నాలుగు నెల్లలో ఆ గృహ పరిస్థితి మారిపోయింది మళ్ళీ అన్నీ యథాప్రకారంగా ఆనందంగానే గడిచిపోతున్నవి ఇంతకుముందు శంకరయ్య భార్య చేసే పనులన్నీ కొన్నాళ్ళు శాంత ఆధిపత్యంలో శిథిలాలయినయ్. ఇప్పుడు మళ్ళీ అవి తలెత్తినయ్ సుశీలను బళ్ళో చేర్పించారు

కమల మంచిదే! కాని ఆమెకు వ్యక్తులమెప్పే, తన చేతలకంటే గొప్పసత్యాన్ని నిరూపించేట్లు కన్పించేది అందువల్ల ఆమె నలుగురున్నప్పుడు సవితిపిల్లలను మరింత ప్రేమగా చూసేది ఇది రామానికి అసహ్యం తండ్రితో పాటు భోజనానికి రావటమంటే కోపం అతని కున్నకోపం చాలారోజులకు ముందే దిగజారిపోయింది ఇంకా ఏమూలన్నా దానిప్రభావం ప్రజ్వలిస్తోందంటే అదేమంత ప్రమాదకారికాదు అయినా రామం తనతండ్రి ఎదుట తనకోపం తా పోయినట్లు ప్రవర్తించటానికి ఇష్టపడేవాడు కాదు. తన గాంభీర్యానికే, పరువుకే నష్టమని అందువల్ల బెట్టు ప్రవర్తించేవాడు అన్నానికొచ్చినా ఎక్కువమాట్లాడేవాడుకాడు తనకు కావలసినవేనా ఒకటిరెండు మాట్లకంటే ఎక్కువసార్లు అడగటం తటస్థపడేదికాదు ఒకవేళ కమల అతను అడిగింది పొరపాటున వినిపించుకోకపోతే, - అంతే! అడిగేవాడుకాదు అట్లాగేతిని లేచిపోయేవాడు. అతని ప్రవర్తనంతా కనిపెట్టి కమల ఒకనాడు రామంతో అన్నది "కేవలం నీ ఆరోగ్యమైనా చూసుకోకపోతే పనిసాగదు రామం! నీకు కోపముంటే ఉండనీ! అది ఎవరి మీద ఉన్నదో వారి మీద దాన్ని ప్రయోగించవద్దని నేననను కాని నీచదువుకి భంగం కల్గవచ్చు చాలా చిక్కిపోయి అట్లా నీరసంగా ఉంటే ఏమి చదువుతావు" ఇంకా ఏదో చెప్పబోతున్నది మేడ మెట్లెక్కుతూ రామం అన్న ఈ మాటలు కమలకు వినిపించినయ్ "నిన్నగాక మొన్న వచ్చిన వాళ్ళకు పరుల ఆరోగ్యంమీద ఇంత శ్రద్ధ కలిగిందంటే, అది గొప్ప కోసమైనా అయుండాలి, లేకపోతే వాస్తవికతకు దూరమైనదాన్ని దగ్గరగా చేయడానికైనా అయ్యుండాలి అయినా నాకు ఇటువంటి మాటలు " ఆతర్వాత మాటలు కమలకు వినిపించలేదు. నిశ్చేష్టురాలైపోయిందా రామంలో, శంకరయ్య రెండో పెళ్ళి విషయమై ఇంత కోపముంటుందని ఆమె అనుకోలేదు. ఆమె కొన్ని కథల్లో 'సవతి తల్లి' అంటే ఎంత ప్రేమగా చూసినా, పిల్లలకు కష్టంగానే ఉంటుది" అని చదివినప్పుడు "రచయిత వాస్తవికతకు దూరంగా రాశాడుకాబోలు, ప్రేమగా చూస్తూంటే ఆ ప్రేమను వాళ్ళెందుకు స్వీకరించలేరు?" అని ప్రశ్నించుకునేది ఇవన్నీ విద్యాహీన అయిన కమల చిన్నతనపు సందేహాలు ఆమె దేన్నీ వివరంగా, తరిచి తరిచి ఆలోచించలేకపోయేది ఆలోచన పూర్తిగా కొనసాగించుకుండే ఉపాయంకూడా తెలియదామెకు— ఇప్పుడామె ప్రశ్నకు ఆమే సమాధానం చెప్పుకునే రోజు వచ్చింది అయినా కమల, రామం యొక్క ఈ మాటల్లో, అతని సంబంధమైన ఒక సత్యాన్ని కూడా విస్పష్టీకరించుకుంది — రామం పైపైకి అనేయగలడనే కాని, అతను శంకరయ్య ఎంత దౌర్బల్య హృదయుడని భావించాడో, అంతకంటే దౌర్బల్యం అతనిలో దాగి దాగి అతనిచేత అనుకోని ప్రవర్తనలకు పురి గొల్పుతుందని భావించింది ఈ భావం ఆమెలోకి, ఆ క్షణాన రావటమే ఆశ్చర్యం! కమల అతని ప్రవర్తనయొక్క నిజస్వరూపాన్ని తెలుసుకొనగలిగింది.

దొడ్లో శాంత రామం తిన్న కంచం కడుగుతున్నది.

కమల ప్రశాంతంగా అన్నది శాంతతో.

"శాంతా ! మీ అన్నయ్యకు, మీనాన్న పెళ్ళి చేసుకోవటం ఇష్టంలేదను కుంటాను" — మొహం బాధాకలిత మైఉన్నా, అత్యంత సహజంగా ఉన్నయ్ మాటలు శాంతకు సిగ్గనిపించింది తలవంచుకుని చేతిలో కంచాన్ని ఆడిస్తూ "ఊహుఁ" అని మాత్రం అనగల్గింది కమల ఏమీ మాట్లాడలేదు. మెల్లగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది

శాంతకు తెలుసు రామం కోపం ఎలాంటిదో ? — ఆమెకు తన తల్లిబాగా జ్ఞాపకం ఆమె కప్పుడు పదిహేనేళ్ళు, ఆవిడ పోయిరెండేళ్ళయింది అటువంటప్పుడు అర్థాంతంలో వచ్చిన ఈ కమలను "పిన్నీ" అని పిలవాలన్నా, అమ్మె ప్రేమను స్వీకరించాలన్నా కష్టంగానేఉంది కాని ఏమిచేయగలదు? ఇప్పటి వఱకూ ఆమె గట్టిగా మాట్లాడగా ఎవరూ వినలేదు

ఒచ్చి నాలుగునెలలే అయితా కమల ఆయింటి పరిస్థితినంతా గ్రహించింది రామంలోని దౌర్బల్యం గ్రహించటం మొదట ఆమెకు కష్టసాధ్యమే అయినా, కనుక్కునే సమయ మొచ్చేసరికి ఇట్టే అంతా అర్థమై పోయింది

పొద్దున్న పదిగంటలయే సరికి తాంబూలమూ, సూటూ, బూటూ అన్నీ సింగారించి కోర్టుకు హాజరయేవాడు శంకరయ్య రామంకూడా తొమ్మిది గంటలకల్లా, "నేనేం తక్కువ వాణ్ణా?" అన్నట్లు పూల రంగడిలా కాలేజీకి పోయేవాడు కాని కమలకనిపిస్తే ధుమ ధుమ లాడుతున్నట్లు నటించినా లోలోపల పశ్చాత్తాప పడేవాడు ఒకనాడు రామం కాలేజీకిపోతుండగా, కమల విస్తరిపారేసి లోపలికొస్తూ అతనికి కన్పించింది తనకు ఆమె మీద కోపమనీ, దౌర్బల్యానికి తాను లొంగేవాడు కాడనీ నిరూపింపడాని కన్నట్లు 'ఉఁ' అంటూ లోపలికి పోబోతున్నాడు రామం అతని విసుగు కమల గ్రహించింది "మరేం ఫరవాలేదు రామం ! ముత్తైదువుఎదురొస్తే మంచిశకునమే !" అంది నవ్వుతూ,

రామం తడబడ్తూ నుంచున్నాడు

కమల నవ్వుతూ "ఎదో మర్చిపోయి నట్టున్నావు ! అందుకేనా లోపలికెళ్ళటం?" — నవ్వు ఆపేసి తీక్ష్ణంగా అంది. "రామం! నీకు సవితితల్లిననే అనుకో అయినా నేను నిన్నేమీ హీనంగా చూడటం లేదుగా ! పోనీ మీ అమ్మను గూర్చి అసహ్యించు కుంటున్నా నంటే అది శాంతకు తెలుసు — ఏదీ లేనప్పుడు నీకు ఎవరిమీద, ఎందుకు ఆ ధుమ ధుమ ! సరే, ఇదిచెప్పు అన్నీ జరిగాక నీకా ధుమ ధుమ ఎంతమాత్రం తోడ్పడుతుందో చెప్పు చూద్దాం—"

రామం మాట్లాళ్ళేదు త్వరగా కాలేజీకెళ్ళిపోయాడు చాలా ఆశ్చర్య పోయాడు కాని, దాన్ని బైటికి కన్పించనివ్వలేదు — కమల ఎప్పుడూ ఇట్లామాట్లాళ్ళేదు మరి!

3

"శాంతకు ఒకచక్కటి సంబంధ మొచ్చిందిరా !" అన్నాడు శంకరయ్య

"ఎక్కడ?" అన్నాడు రామం కొన్నిరోజుల్నుంచీ అతని ధుమ ధుమమంతా తగ్గిపోయింది అప్పు డప్పుడు రేగుతూంటుంది అంతే ! !

అతని సహజమైన కంఠస్వరం విన్న శంకరయ్యకు కూడా ఎందుకో ఆనందం పెల్లుబికి వచ్చింది

"పిల్లవాడు ఎం బి. బి ఎస్. చదువు తున్నాడట ఎనిమిదివేల కట్నం చదువైపోగానే ఇంగ్లండు వెళ్తాడట మంచి ఆస్థిపరుడు తల్లివుంది తండ్రి నాలుగుసంవత్సరాల క్రితం పోయాడట" గుక్క త్రిప్పుకోకుండా చెప్తూన్న అతన్ని, రామం తన సంకుచితత్వంతో ఆపేశాడు "అంతడబ్బా? ఏదీ?" అన్నాడు

"ఏం మంచి సంబంధమేగా!" అన్నాడు శంకరయ్య.

"అవునులే ! అయినా అంత కట్నం "

"ఏముందిలేరా ! ఎదోపిల్ల సుఖ పడుతుంది అంతకంటే ఏంకావాలి మనకు? ఇంతకీ ఆడబ్బంతా ఎవరో వీధిన పోయేవాడికి కాదుగా ఇచ్చేది ! మనపిల్ల సుఖపడటానికేనాయను !" అని కొంచెంసేపాగి "రెండెకరాల పొలమమ్మితే దగ్గఱ దగ్గఱ రూ2000 లకు పైగా ఒస్తుంది బ్యాంకులో ఆరువేలున్నయ్యి పెళ్ళిఖర్చులకి వాటికి ఇంకో ఎకరంకూడా అమ్మితేతప్ప పని జరుగదు" అన్నాడు.

ఇద్దరిమధ్యా నిశ్శబ్దత ఆవరించింది శంకరయ్య మాట్లాడాడు "నీపెళ్ళికూడా అయిపోతే తేలికరా నాక

"చూద్దాంలే — అయినా నాకిప్పుడు పెళ్ళేమి

అన్నాడు రామం, శంకరయ్యను కించపఱచటాని కన్నట్లు. కాని శంకరయ్య అదేమీ గమనించకుండా తనధోరణిలోనే మాట్లాడటం మొదలు పెట్టాడు

"ఇక్కడ ఒకసంబంధ మున్నది . " అంటూ "ఎవరికి?" అన్నాడు రామం "నీకేనురా" అన్నాడు శంకరయ్య "ఏం? మాలతి ఉండగా ఇంకో సంబంధమెందుకూ? " అన్నాడు తీక్షణంగా రామం

శంకరయ్య అప్పటికేమీ మాట్లాడలేదు ఆనందంగా అంతాకలసి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు కమల రామాన్నిచూసి లోలోపల నవ్వుకున్నది జాలిగానూ ప్రేమగానూ ఇంతకీ ఆశ్చర్యమేమిటంటే కమలను రామం పూర్వమెంత అసహ్యించుకున్నా, కమల మాత్రం అతన్ని అభిమానంగా చూసేది కమలకు అతన్నిచూస్తే పుత్రప్రేమ పెల్లుబికి వచ్చేది రామం అందగాడు నవ్వినా, కోపమొచ్చినా అతనిమొహం ఎంతో బాగుంటుంది నుదుటి మధ్యఉన్న మచ్చ అతనికింకోవిధంగా అందాన్ని కూర్చేది స్త్రీ కుండవలసిన సుకుమారత్వమంతా అతని కుండేది అంత మాత్రాన అతన్ని స్త్రీతో పోల్చి అందాన్ని అధ్వాన్నంచేస్తున్నట్లు భావించకూడదు—మొత్తం మీద అతను చాలా అందగాడు — ఇదేనిజం!!

ఈమధ్య శంకరయ్యకు కొంచెం ప్రాక్టీసుకూడా ఎక్కువైంది రామం బి ఎ చదువుతున్నాడు ఆతర్వాత ఎం ఎస్ సి యో లేకపోతే ఎం ఏ అది తర్వాత చేయబోయే నిర్ణయం కాబట్టి ఆర్థికంగానైనా, మరేవిధంగాను అందుకు బాధపడటం అనవసరం, శాంత పెళ్ళి అయిపోతున్నది. ఒక పెద్ద బండను తలమీదినుంచి తీసినట్లుగా సంతోషించాడు శంకరయ్య శంకరయ్య మొదటి భార్య ఉండగా ఆయింటి కెటువంటి కళవచ్చిందో, అదే మళ్లీ కమల రాగానే ప్రతిబింబించింది ఇంతకీ శాంత పెళ్ళివిషయంమీద కమల పట్టుబట్టకపోతే శంకరయ్య కట్నం ఇవ్వలేనంటూ, అంతమంచి సంబంధమూ వదులుకునేవాడే కాని కమల అన్నది "డబ్బూ ఖర్చు కాకూడదు. మంచి సంబంధం దొరుకాలంటారు ఎట్లా?"

"అబ్బే అంతంత మంచివి మనకెక్కడొస్తయ్‌లే!" అన్నాడు పెదిమవిఱుస్తూ "అయితే ఒక్కపిల్ల పెళ్ళికే నెత్తిన గుడ్డేసుకో మన్నావా ఏం? " అన్నాడు మళ్ళీ

"అయితే మీ అంతవాణ్ణిచ్చి కట్టండి ఏం పోయింది? మీరందుకు మార్గదర్శికులేగా!" అంది కమల పకపక నవ్వుతూ.

శంకరయ్యను ఆమె అప్పుడప్పుడు అట్లాగే హాస్యం చేస్తూండేది ఆమె అట్లా అన్నప్పుడల్లా శంకరయ్య గంభీరంగా మొహం పెట్టి, స్నిగ్ధహాసంతో అక్కణ్ణుంచి వెళ్ళిపోయేవాడు కాని ఇప్పుడు కృతజ్ఞత తెల్పుతూ అన్నాడు "నువ్వే లేకపోతే నిజంగా డబ్బు చూసి అంత పనీ చేసేవాణ్ణే! నువ్వింత చేస్తున్నా రామం నీ విషయంలో చాలా తీవ్రంగా ఉంటున్నాడు కాని ఈ దెబ్బతో వాడికి నీమీద అభిమానం కల్గి తీరుతుంది" అంటూ వెళ్ళిపోయాడు కమల మంచితనం ఆ గృహాన్ని మళ్ళీ ఆనందమనే వెల్గుతో ప్రకాశింప జేసింది

ఈలోగా రామం మేనమామ ఉత్తరం రాశాడు 'మాలతి పెళ్ళి విషయం రామానికిష్టమో కాదో తెల్పమంటూ!' రామం చదివాడు ఆ ఉత్తరాన్ని

క్రిందటి ఎండాకాలంలో తన తండ్రి రెండో పెళ్ళికి వచ్చింది మాలతి మరీ అందమైనది కాకపోయినా ఫరవా లేదనిపిస్తుంది శాంతకన్నా పెద్దది చదువుకుంటున్నది పెద్దంటే ఎంతో కాదు. ఆఱు నెలలు- శాంతా, మాలతీల మధ్య వార మామయ్యకు ఒక్కతే కూతురు. కాబట్టే బతికిపోయాడు లేకపోతే వంద రూపాయల జీతంలో అంతమంది ఏమి తింటారు?

శంకరయ్య రామాన్ని అడిగాడు.

"మాలతిని చేసుకుంటాను" అన్నాడు రామం

"మాలతినా !" అన్నాడు శంకరయ్య పూడిపోయిన గొంతుతో

"ఏం"

"నేనూ ఆడపిల్లలు గలవాణ్ణిరా రామం! బుద్ధిమంతుడైన కొడుకైతే తండ్రి కష్టసుఖాల్ని గమనించిపోతాడు నా కూతురు పెళ్ళికి నా రక్తం ధారపోసినట్లు, నా శక్తికి మించిన కట్నాలిస్తున్నాను అట్లాగే నీ పెళ్ళికి కూడా ఏదో కొంత వస్తే దాంతో సుశి పెళ్ళి చేసెయ్య వచ్చని నా ఆలోచన అయితే, మాలతిని చేసుకుంటే మామయ్య ఏమిస్తాడు చెప్పు?"

"రెండు వేలిస్తానని రాశాడుగా!" అన్నాడు రామం

"నేను ఎనిమిది వేలూనూ, వాడు రెండు వేలూనా?"

రామం శంకరయ్యను దౌర్భల్య పరుడుగా భావించుకుని అసహ్యించుకున్నాడు. లేకపోతే ఏమిటి? "నేను ఎనిమిది వేలూను, వాడు రెండు వేలూనా?" అని పసి పిల్లలు

ఒంటులేసుకుని ఆటలాడుకుంటునట్లు తీక్షణంగా అన్నాడు రామం "ఇదేం ఆటా రెండు వేలూ, ఎనిమిది వేలూ అనటానికి? అయినా మామయ్యా పరిస్థితిని పరిశీలించకుండా అట్లా మాట్లాడితే ఎట్లా? వంద రూపాయలు జీతం తల్లి క్షయరోగి తీసుకు తీసుకు చావటం తప్ప ఫలితం కన్పించకపోయె! అందులో 'శాంతా వాళ్లకుమల్లే చదువు మాన్పించి ఇంట్లో కూర్చోపెట్టాడా మాలతిని?' అంటే అది స్కూల్ ఫైనల్ చదువుతోంది చక్కగా మరి అంతకంటే ఎక్కువ చేసేవాళ్ళు ఆస్థితిలో ఎవరుంటారెం?"

"సరే ప్చ్ అయితే సుశి పెళ్ళికి మిగిలిందంతా అమ్మితే అయేట్లు' లేకపోతే " శంకయ్యా. ఈ మాటలు స్వశవానికి సంబంధించినవే అయినా రామానికి హఠాత్తుగా కోపం ముంచుకొచ్చింది

"నువ్వు ఎవరిష్టంతో రెండోపెళ్ళి చేసుకున్నావు? నాయిష్టం— నేను మాలతినే చేసుకుంటాను" అన్నాడు

శంకరయ్య కూడా ఈసారి మండి పడ్డాడు

"చేసుకో ఎవరు వద్దన్నారు? నా కష్టాలకోసం నాలో నేను ఏడవటానికైనా అధికారంలేదూ? పుట్టావులే సుపుత్రుడివి' దయచెయ్ అవతలికి" అన్నాడు

రామం పెంకెగా జవాబిచ్చాడు

"పోతా పోతా – ఎందుకు పోనూ?"

"అదే ఏదో త్వరగా కానిమ్మంటున్నాను సంపాదించి పెట్టుంటే తెలియటంలా " అంతకంటే ఇంకా ఏమని మందలించాలో అతనికి అర్థం కాలేదు రామం నిశ్చలంగా మేడమీదికెళ్ళాడు కాని మనసేమిటోగాఉంది ఇక్కడి వక్కడ అక్కడివిక్కడ సద్దటం మొదలు పెట్టాడు అయినా, అతనికి ఆపని మనసులోని కలతను బైటికినెట్టి ఆస్థానాన్నే శాంతి స్థాపన చెయ్యలేక పోయింది రామం విసుగ్గా మంచంమీద పడి దొర్లటం మొదలు పెట్టాడు తను తొందరపడి తండ్రిని అసహ్యంగా మాట్లాడాననుకున్నాడు ఈ మాట కమల విన్నదేమోనని మరీ బాధ పడ్డాడు మొట్ట మొదట్లో రామానికి కమలమీద ఎంత అసహ్యం కల్గేదో, ఇప్పుడు అంత గౌరవం మిగతా విషయాలెట్లాఉన్నా, కమల అందరికీ అనుకూలంగా అందంగా సంసారాన్ని నడిపిస్తోంది అప్పుడప్పుడు అందరికీ కల్గేమనోవివరాలే ఆమెకూ కల్గుతూంటయ్ అంతేకాని నీచ శ్రేయస్సు చేర్చ దగ్గిందికాదు ఆమె ధనవంతుడి కూతురై పుడితే ఈ రెండో పెళ్ళి బాధ ఉండేది కాదేమో? ఎంతమందికి ముప్పై ఏళ్ళకి పెళ్ళి కావటంలేదు? కానీ ఆ అయే విధానాల్లో కూడా కొన్ని రకాలున్నయ్యి చదువుకుంటున్న ఆడది, కేవలం చదువు కోసమే పెళ్ళి మానుకున్నదీ- అంటే దిగులేమీ లేదు డబ్బును చూపి, ఏమీ లేకుండా కూడా, అంటే అందమూ చందమూ సున్నా అయినా పెళ్ళంటూ కాకపోదు, కాని తర్వాత గతిమీద పంచ ప్రాణాలూ పెట్టుకుని బాధ పడాల్సి వస్తే రావచ్చు. ధనం లేకుండా అందం ఉంటే ధనమున్న కామోద్రేకికి ఆహారం అవుతుంది పాపం ఆ స్త్రీ! ఎవరైనా అంతే లెండి, అయినా ఇదొక ఒకం" —

అప్పుడే ఎప్పుడు నిద్ర పట్టిందో అతనికే తెలీదు మెలకువ కల్గే సరికి అర్ధరాత్రి! వెన్నెల తప్ప అతనికేమీ కన్పించలేదు రామం మెల్లగా లేచి ఆరు బయటకొచ్చి పిట్టగోడనానుకుని నుంచున్నాడు

వెన్నెలరాత్రి' మాలతి ప్రక్కన ఉన్నట్లు భావించుకున్నాడు ఆకాశంలో మబ్బులమధ్య తల్లి ప్రేమపూరిత దృక్కులు తనపై ప్రసరించి, ఆశీర్వదించి, ఆనందింపజేసి తరలి పోతున్నట్లు అనుకున్నాడు దేశంలో ఆడపిల్లలను భారంగా చూసే తల్లితండ్రు లెంతమంది? అని హఠాత్తుగా, అసందర్భంగా తన్ను తాను ప్రశ్నించుకున్నాడు— మామయ్యతల్లి మాలతికి పెళ్ళి కాలేదని ఒకటే సణుగు తున్నా, మామయ్య మాలతిని స్కూల్ ఫైనల్ వరకైనా చదివించాలని వాదించాడు అనుకున్న అతని అభిప్రాయం సఫలీకృతమైంది అయినా పెళ్లికాని పిల్లకు చదువు మాన్పించేవాడుకాడు మామయ్య ముందుచూపు గలవాడు అందుకే ఇప్పుడు మాలతి కాలేజీలో చేరిరిది ఇప్పుడు మామయ్య ఆమె పెళ్లి విషయం రాసేడు అంతకుముందు మామయ్య రామానికే ఉత్తరం రాస్తే "నా చదువు పూర్తయిన తర్వాత మాలతినే చేసుకుంటాను నువ్వేమీ దిగులు పడవద్దు" అని తండ్రికి తెలియకుండానే స్వతంత్రించి జవాబు రాశాడు రామం దాని ఫలితం నిన్నటి మామయ్య ఉత్తరం

రామం ఆలోచిస్తూనే గడిపేశాడు ఆ రాత్రంతా ఎందుకో అర్థం కాని ఆవేదన పుట్టింది తన తల్లే బతికుంటే, పేదవాడు మామయ్యను కాదని ఇంకో సంబంధం స్థిరపరచటానికి ప్రయత్నించేదేనా? అంతగా డబ్బు లేదనుకుంటే తన ఒంటిమీద నగలైనా అమ్మిచ్చేది!—

[ఇంకావుంది]